بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ   نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ   وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

Summary of Friday Sermon Hazrat Khalifatul Masih V, 03 October 2025 (Telugu)

## ఘజ్వ హునైన్ (యుద్ధ) నేపథ్యంలో
## హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం జీవిత చరిత్ర ప్రస్తావన

**హజ్రత్ అమీరుల్ ముమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 03.10.2025 తేదీన – మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్, టిల్‌ఫోర్డ్, (సిర్రె) ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశం**

أَشۡهَدُ أَنۡ لَّاۤ إِلٰهَ إِلَّا اللّٰهُ وَحۡدَهٗ لَا شَرِيۡكَ لَهٗ وَأَشۡهَدُ أَنَّ مُحَمَّدًا عَبۡدُهٗ وَرَسُوۡلُهٗ. أَمَّا بَعۡدُ فَأَعُوۡذُ بِاللّٰهِ مِنَ الشَّيۡطٰنِ الرَّجِيۡمِ.
بِسۡمِ اللّٰهِ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ ○ اَلۡحَمۡدُ لِلّٰهِ رَبِّ الۡعٰلَمِيۡنَ ○ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ ○ مٰلِكِ يَوۡمِ الدِّيۡنِ ○ اِيَّاكَ نَعۡبُدُ وَاِيَّاكَ
نَسۡتَعِيۡنُ ○ اِهۡدِنَا الصِّرَاطَ الۡمُسۡتَقِيۡمَ ○ صِرَاطَ الَّذِيۡنَ اَنۡعَمۡتَ عَلَيۡهِمۡ غَيۡرِ الۡمَغۡضُوۡبِ عَلَيۡهِمۡ وَلَا الضَّآلِّيۡنَ ○

తషహ్హుద్, తఅవ్వుజ్, ఫాతిహా అధ్యాయం పఠించిన అనంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించారు.

హునైన్ యుద్ధం తరువాత అందులో లభించిన యుద్ధ సంపద మరియు దాని పంపిణీ గురించి ప్రస్తావన జరుగుతుండెను. దీని గురించి మరిన్ని సంఘటనలు ఈ విధంగా వివరించబడ్డాయి.

హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం అన్ని యుద్ధ సంపదలను జి'రానా అనే ప్రదేశంలో పోగుచేయాలని ఆదేశించారు. అనంతరం ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం తాయిఫ్ నగరం వైపునకు వెళ్లారు. సుమారు ఒక నెల తరువాత, తాయిఫ్ నుండి తిరిగి జి'రానాకు వచ్చారు. అక్కడకు చేరుకున్న తరువాత కూడా, ఆయన (స.అ.స.) సంపదను వెంటనే పంచకుండా కొన్ని రోజుల వరకు నిరీక్షించారు. కొంతమంది అభిప్రాయం ప్రకారం, బనూ హవాజిన్ తెగ వారు పశ్చాత్తాపపడి, తిరిగి వస్తారేమో అని మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం పదమూడు లేదా పద్నాలుగు రోజుల వరకు వేచి ఉన్నారు. ఒకవైపు దైవ ప్రవక్త (స.అ.స.) వారి కోసం ఎదురుచూస్తూ ఉండగా, మరోవైపు బనూ హవాజిన్ వారు తాము వెళ్లడం ప్రయోజనకరంగా ఉంటుందా లేదా అనే సందిగ్ధంలో ఉండిరి. చివరికి, అంతగా వేచి చూసిన తరువాత కూడా ఆ ప్రజలు రాకపోవడంతో, ఆయన (స.అ.స.) యుద్ధ సంపదను, ఖైదీలను పంపిణీ చేశారు. పంపిణీ జరిగిన తరువాత బనూ హవాజిన్ తెగకు చెందిన పద్నాలుగు మంది గౌరవనీయ వ్యక్తులు ఆయన (స.అ.స.) సేవలో హాజరైరి. వీరు అప్పటికే ఇస్లాంను స్వీకరించి ఉండిరి, తమ తెగ మొత్తం కూడా ఇస్లాంను స్వీకరించినట్లు వారు విన్నవించారు. వారు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను దయ చూపమని అభ్యర్థించారు. అప్పుడు ఆయన (స.అ.స.) ఇట్లు బదులిచ్చారు. "నేను చాలా రోజులు మీ కోసం ఎదురుచూశాను, ఆ తరువాతనే యుద్ధ సంపదను పంపిణీ చేశాను. ఇప్పుడు మీరు చూస్తున్నారు కదా, ఖైదీలలో చాలా తక్కువ మంది మాత్రమే మిగిలి ఉన్నారు, మిగతా అందరినీ పంపిణీ చేయడం జరిగింది. కాబట్టి, మీరు ఇప్పుడు సంపద వస్తువులలో లేదా ఖైదీలైన పురుషులు, స్త్రీలలో ఏదో ఒకదాన్ని ఎంచుకోవచ్చు". అప్పుడు బనూ హవాజిన్ ప్రతినిధులు ఖైదీలైన పురుషులు మరియు స్త్రీలను తిరిగి తీసుకోవాలని నిర్ణయించుకున్నారు. దానిపై దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం బనూ అబ్దుల్ ముత్తలిబ్ వద్ద ఉన్న ఖైదీలను వెంటనే తిరిగి ఇచ్చారు. మిగిలిన ఖైదీల గురించి

ఆయన (స.అ.స.) వారికి ఇట్లు ఒక సలహా ఇచ్చారు. వారు ముస్లింల ఎదుట తమ ఇస్లాంను బహిరంగంగా ప్రకటించి, దైవ ప్రవక్త (స.అ.స.) అనగా తనను తమ కోసం సిఫారసు చేసేవారిగా నియమించుకోవలెను. కావున వారు అలాగే చేశారు. అప్పుడు మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం సాటిలేని దయ, దాతృత్వం కారణంగా బనూ హవాజిన్ ఖైదీలందరూ గొప్ప పద్ధతిలో విముక్తులయ్యారు.

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఆ ఖైదీలను ఎటువంటి ప్రతిఫలం లేకుండా విడుదల చేయడమే కాకుండా, వారికి బట్టలు కూడా ఇచ్చారు. వారు ఇట్లు ఆదేశించిరి. విడుదల అవుతున్న ఒక్కరు కూడా క్రొత్త దుస్తులు లేనిదే వెళ్లకూడదు. ఈ ఆదేశానుసారం విముక్తులైన ప్రతి ఖైదీకి కొత్త దుస్తులు లభించాయి. ఒక వృత్తాంతం ప్రకారం ముగ్గురు వ్యక్తులు తమ ఖైదీలను తిరిగి ఇవ్వడానికి నిరాకరించారు. మరొక వృత్తాంతం ప్రకారం, దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు: బనూ హవాజిన్ ఖైదీలందరూ స్వతంత్రులు. తమ ఖైదీలను విడుదల చేయడానికి ఇష్టపడని వారికి, అందుకు బదులుగా ప్రభుత్వ ఖజానా నుండి ఆరు ఆరోగ్యకరమైన ఒంటెలు పరిహారంగా ఇవ్వబడతాయి. దీని వలన నిరాకరించిన వారందరూ కూడా అంగీకరించారు. ఈ విధంగా బనూ హవాజిన్ ఆరు వేల మంది ఖైదీలు విముక్తులయ్యారు.

కొన్ని కథనాల ప్రకారం ఉయైనహ్ బిన్ హిస్న్ ఫజారీ అవిధేయత చూపెను తద్వారా అతడు తీవ్రమైన అవమానానికి గురయ్యాడు. అతడు ఎలాంటి ప్రయోజనం లేదా శుభం పొందలేదు. ఆ వివరాలు ఇట్లు వ్రాయబడెను. ఉయైనహ్ తప్ప అందరూ తమ ఖైదీలను తిరిగి ఇచ్చారని దైవ ప్రవక్త (స.అ.స.) కు చెప్పినప్పుడు, ఆయన (స.అ.స.) "అల్లాహ్ అతనికి నష్టం కలిగించుగాక" అని అన్నారు. అతని ఖైదీల సంఘటన ఇట్లు గలదు. ఉయైనహ్ ఒక యువతికి బదులుగా వృద్ధురాలిని ఖైదీగా తీసుకున్నాడు, ఆమెకు చాలా మంది పిల్లలు ఉన్నందున, ఆమె ద్వారా పెద్ద మొత్తం విమోచన ద్రవ్యం (ఫిద్యా) లభిస్తుందని ఆశించాడు. ఆ వృద్ధురాలి కొడుకు, ఉయైనహ్ వద్దకు వచ్చి, వంద ఒంటెల పరిహారాన్ని ఇవ్వజూపగా, ఉయైనహ్ మరింత ఆశతో నిరాకరించాడు. కొద్దిసేపటి తరువాత ఉయైనహ్ స్వయంగా కొడుకు వద్దకు వచ్చి, నువ్వు ఇస్తానన్న ఒంటెలను ఇప్పుడిస్తావా? అని అడిగాడు. దానికి ఆ యువకుడు ఇప్పుడు నేను యాభై ఒంటెలు మాత్రమే ఇస్తానని చెప్పాడు. ఈ విధంగా, ఉయైనహ్ ఎంత అడిగినా, యువకుడు అంతకంటే తక్కువ ఇస్తానని చెప్పడం కొనసాగింది. చివరకు, ఉయైనహ్ విసిగిపోయి, ఈ వృద్ధురాలిని నా నుండి ఉచితంగా తీసుకెళ్ళు అని అన్నాడు. దానికి ఆ యువకుడు, పవిత్ర ప్రవక్త (స.అ.స.) ప్రతి ఖైదీని విడిపించడంతో పాటు వస్త్రం కూడా ఇచ్చారు, కానీ ఈ వృద్ధురాలు దానిని పొందలేకపోయింది, కాబట్టి ఆమెకు కూడా వస్త్రం ఇవ్వాలని అన్నాడు. చివరకు, ఉయైనహ్ తన చద్దరును ఇవ్వవలసి వచ్చింది. ఈ విధంగా ఆ యువకుడు ఆ స్త్రీ ఖైదీతో పాటు వస్త్రాన్ని కూడా తీసుకుని వెళ్ళాడు.

బనూ హవాజిన్ నాయకుడైన మాలిక్ బిన్ ఔఫ్ గురించి దైవ ప్రవక్త (స.అ.స.) ఆరా తీయగా, అతను తాయిఫ్‌లో బనూ సఖీఫ్ వద్ద ఉన్నట్లు తెలిసింది. ఆయన (స.అ.స.) అతనికి ఇట్లు ఒక సందేశం పంపారు. నువ్వు నా విధేయతను స్వీకరించి వస్తే, నీ కుటుంబ సభ్యులను నీకు తిరిగి ఇవ్వబడును. మాలిక్ బిన్ ఔఫ్ హాజరైనప్పుడు, ఆయన (స.అ.స.) అతనికి అతని కుటుంబ సభ్యులను

తిరిగి ఇవ్వడమే కాకుండా, ఒక వంద ఒంటెలను బహుమతిగా కూడా ఇచ్చారు. మాలిక్, దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఈ ఔదార్యాన్ని చూసి ఇస్లాంను స్వీకరించాడు.

బనూ హవాజిన్ ఖైదీలలో షైమా అనే మహిళ కూడా ఉండెను. ఆమె అసలు పేరు హుజాఫా. ఆమెను బంధించినప్పుడు, ఆమె నేను మీ ప్రవక్త స్థన్య సోదరినని చెప్పగా, ఆమెను దైవ ప్రవక్త (స.అ.స.) వద్దకు తీసుకువచ్చారు. ఆమె వారి స.అ.స. దంతాల గుర్తును దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంకు చూపించి, మీరు నా ఒడిలో ఉన్నప్పుడు నన్ను కొరికారని" చెప్పింది. ఆమె అప్పుడు తాము మేకలను మేపే వారమని, తన తల్లిదండ్రులు ప్రవక్త గారి పెంపుడు తల్లిదండ్రులని వివరించింది. ఇది విని దైవ ప్రవక్త (స.అ.స.) తన స్థానం నుండి లేచి, ఆమె కోసం తన చద్దరును పరచి, 'దీనిపై కూర్చోండి' అని అన్నారు. ఆయన కళ్ళ నుండి కన్నీళ్లు వచ్చాయి. ఆయన తన పెంపుడు తల్లిదండ్రుల గురించి తెలుసుకోగా, వారు మరణించారని ఆమె చెప్పింది. ఆయన షైమాకు అక్కడే ఉండాలా లేక తిరిగి వెళ్ళాలా అనే స్వేచ్ఛను ఇచ్చారు. ఆమె ఇస్లాంను స్వీకరించి, తిరిగి వెళ్ళాలని నిర్ణయించుకున్నారు. ఆయన ఆమెకు ముగ్గురు బానిసలను, ఒక బానిస స్త్రీతో పాటు, కొన్ని ఒంటెలను కూడా ఇచ్చారు. అబూ దావూద్ అను హదీస్ పుస్తకంలోని ఒక బలహీనమైన వృత్తాంతం ప్రకారం, దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం స్థన్య తల్లి కూడా జి'రానా వద్ద ఆయనను కలవడానికి వచ్చి ఉండిరి. కానీ దాని కథకుల సాక్ష్యం బలహీనంగా ఉంది. హుజూరె అన్వర్ ఇట్లు వివరించారు. ఆ సంఘటన వేరే సందర్భంలో జరిగి ఉండవచ్చు లేదా దాన్ని వివరించిన వ్యక్తి పొరపాటు పడి ఉండవచ్చును, ఎందుకంటే వృత్తాంతాల ప్రకారం ఆమె (పెంపుడు తల్లి) హునైన్ యుద్ధానికి ముందే మరణించారు.

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మక్కా నుండి మదీనాకు వలస వెళ్ళినప్పుడు, వంద ఒంటెల బహుమతి ఆశతో ఆయనను సురాఖా బిన్ మాలిక్ వెంబడించెను. అప్పుడు ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం అతనికి ఒక భద్రతా పత్రం వ్రాయించి ఇచ్చి ఉండిరి. అదే సురాఖా, ఆ పత్రంతో సహా, జి'రానా వద్దకు వచ్చి ఇస్లాంను స్వీకరించాడు.

ఆ జి'రానాలోనే బస చేసిన సమయంలో, ఆయన సల్లల్లాహు అలైహి వసల్లం ఒక రాత్రి ఉమ్రా సంకల్పంతో మక్కాకు వెళ్ళి, రాత్రికి రాత్రే తిరిగి వచ్చారు. ఆయన ఎక్కడికీ వెళ్ళలేదని ప్రజలు అనుకున్నారు. జుల్ ఖ'దా నెలలో పన్నెండు రోజులు మిగిలి ఉండగా, దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మదీనాకు తిరుగు ప్రయాణం ప్రారంభించారు. తొమ్మిది రోజుల ప్రయాణం తరువాత మదీనాకు చేరుకున్నారు. హుజూరె అన్వర్ ఇస్లాం పాశ్చాత్య విమర్శకుల కొన్ని బలహీనమైన అభ్యంతరాలతో పాటు వాటి సంక్షిప్త సమాధానాలను వివరిస్తూ, ఇవన్నీ ఇంతకుముందు కూడా వివరించబడ్డాయని అన్నారు.

హుజూరె అన్వర్ చివరలో ఇద్దరు దివంగతుల సద్గుణాలను ప్రస్తావించి వారి పరోక్ష అంత్యక్రియ ప్రార్థన చేయిస్తానని ప్రకటించారు. వారిలో ఒకరు గౌ॥ డాక్టర్ లయీఖ్ అహ్మద్ ఫర్రుఖ్ గారు (కెనడా). వీరు చాలా సంవత్సరాలు జీవిత సమర్పిత డాక్టర్‌గా ఆఫ్రికాలో సేవలందించారు. వారెంతో అంకిత భావంతో సేవ చేశారు. వారు నిశ్శబ్ద స్వభావం కలవారు, దుఆలు చేసేవారు, వినయం, నిరాడంబరత గలవారు, ఓర్పు, స్థిరత్వానికి ఉదాహరణగా నిలిచారు. వారు తమ జీవితమంతా మానవ సేవలో గడిపారు. ప్రతికూల పరిస్థితులలో కూడా స్థిరత్వంతో పని చేశారు. హుజూరె అన్వర్ ఇట్లనిరి. తాను

కూడా ఘనాలో ఉన్నప్పుడు వారితో కొంత సమయం గడిపినాను, వారు అత్యంత మంచి మనస్సు గలవారు, వినయులు, సేవ చేసేవారు. వారు వాఖిఫీన్‌ను చాలా గౌరవించేవారు. వారిలో ఆతిథ్యం మెండుగా ఉండేది. భార్యాభర్తలిద్దరూ అతిథులను గౌరవించేవారు. చాలా తక్కువ మందిలో ఉండే అనేక ప్రత్యేకతలు వీరు కలిగి ఉండిరి.

రెండవ ప్రస్తావన హైదరాబాద్, భారతదేశ నివాసులైన గౌ॥ హమీద్ అహ్మద్ ఘోరీ గారిది.

మృతులు మూసీగా ఉండిరి. వారికి భార్య, ఒక కుమార్తె, నలుగురు కుమారులు, మనమళ్లు, మనమరాళ్లు ఉన్నారు. వారి పిల్లలందరు ఏదో ఒక విధంగా జమాఅత్ సేవ చేసే అనుగ్రహాన్ని పొందు తున్నారు. వారు ముహమ్మద్ ఇనామ్ ఘోరీ నాజిర్-ఎ-ఆ'లా ఖాదియాన్ గారి తమ్ముడు. సమద్ ఘోరీ ముబల్లిగ్-ఎ-సిల్సిలా, సదర్-ఎ-జమాఅత్, అల్బేనియా గారి తండ్రి. వారు ఉపవాసం, నమాజ్‌లకు కట్టుబడి ఉండేవారు, తహజ్జుద్ నమాజ్ చేసేవారు, పవిత్ర ఖుర్ఆన్‌ను ప్రేమించేవారు. వారు హజ్ మరియు ఉమ్రా చేసే భాగ్యాన్ని పొందారు. వారు ఖిలాఫత్‌కు విధేయులు, సత్కార్యులు, ధర్మమూర్తులుగా ఉండిరి. వారు ఆర్థిక త్యాగాలలో ముందుండేవారు. అవసరమైన వారికి హోమియోపతి మందులను కూడా ఉచితంగా పంపిణీ చేసేవారు. వారు కేంద్ర ప్రతినిధులను మరియు ముబల్లిగీన్‌లను చాలా గౌరవించే వారు.

వారు ఖిలాఫత్ ఆదేశాలను పాటించేవారు. చిన్నదైనా, పెద్దదైనా ఖలీఫా గారి ప్రతి ఆదేశంపై, తాను ముందుగా ఆచరించి, ఆ తరువాత జమాఅత్‌కు తెలియజేయాలని ప్రయత్నించేవారు. ఈ విషయంలో అల్లాహ్ తఆలా దయతో వారు సఫలీకృతులైనా. వారు బంధుత్వాన్ని చాలా పాటించేవారు. తరచుగా తమ బంధువులందరినీ ఇంటికి పిలిచి, వారి సుఖ దుఃఖాలలో పాలుపంచుకునేవారు. వారు నాయిబ్ అమీర్ హైదరాబాద్, సెక్రటరీ తాలీముల్ ఖుర్ఆన్, తమ ప్రాంతానికి సదర్-ఎ-జమాఅత్, నాజిమ్ అన్సారుల్లాహ్, నాయిబ్ సదర్ మజ్లిస్ అన్సారుల్లాహ్ దక్షిణ భారతదేశం వంటి పలు జమాఅత్ సేవల అనుగ్రహం పొందారు. సారాంశమేమనగా జమాఅత్‌నకు వీరు చాలా సేవలందించారు. ఒకసారి ఇక్కడి జల్సలో కూడా పాల్గొన్నారు. అల్లాహ్ తఆలా వారిని క్షమిస్తూ వారి స్థాయి అంతస్తులను పెంచుగాక అల్బేనియాలో ఉన్న వారి కుమారుడు అంత్యక్రియ ప్రార్థనలో పాల్గొనలేకపోయిరి. అల్లాహ్ తఆలా వారికి కూడా ఓర్పు, ధైర్యం ప్రసాదించుగాక! మొత్తమ్మీద వారి అంత్యక్రియ ప్రార్థన తర్వాత చదివింతును.

హుజూరె అన్వర్ గారు దివంగతులకు క్షమాపణ, ఉన్నత స్థానాల కొరకు దుఆ చేశారు.

اَلْحَمْدُ لِلّٰهِ نَحْمَدُهٗ وَنَسْتَعِيْنُهٗ وَنَسْتَغْفِرُهٗ وَنُؤْمِنُ بِهٖ وَنَتَوَكَّلُ عَلَيْهِ - وَنَعُوْذُ بِاللّٰهِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَمِنْ سَيِّئَاتِ اَعْمَالِنَا - مَنْ يَّهْدِهِ اللّٰهُ فَلَا مُضِلَّ لَهٗ وَمَنْ يُّضْلِلْهُ فَلَا هَادِيَ لَهٗ - وَنَشْهَدُ اَنْ لَّآ اِلٰهَ اِلَّا اللّٰهُ وَنَشْهَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ - عِبَادَ اللّٰهِ رَحِمَكُمُ اللّٰهُ! اِنَّ اللّٰهَ يَاْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِيْتَآءِ ذِی الْقُرْبٰى وَيَنْهٰى عَنِ الْفَحْشَآءِ وَالْمُنْكَرِ وَالْبَغْيِ - يَعِظُكُمْ لَعَلَّكُمْ تَذَكَّرُوْنَ - اُذْكُرُوا اللّٰهَ يَذْكُرْكُمْ وَادْعُوْهُ يَسْتَجِبْ لَكُمْ وَلَذِكْرُ اللّٰهِ اَكْبَرُ -